క్లుప్తంగా

గ్రామ దేవతలకు శ్రావణ పట్టీ

పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారి ఆలయం ఆధ్వర్యంలో నియోజకవర్గంలో కొలువై ఉన్న గ్రామదేవతలకు శ్రావణ పట్టీని ఇవ్వటం గత శుక్రవారం మొదటిసారిగా ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 1, 2 తేదీల్లో వత్సవాయి మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ దేవతలకు అలంకరణ ఆనవాయితీగా ఆలయాలకు శ్రావణ పట్టీలో భాగంగా చీర, జాకెట్ ముక్క, పూలు, పూలదండలు, పసుపు-కుంకుమ అందిస్తామని ఈఓ కె.రమేష్‌నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉద్యోగ విరమణ సత్కారం

పెనుగంచిప్రోలు: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ అభివృద్ధిలో శాఖమూడి వెంకటేశ్వరరావు సేవలు మరువలేనివని సంఘ సీఈఓ ఎస్. కొండలుశర్మ అన్నారు. వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ కార్యక్రమం గురువారం సంఘ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. అందరూ సన్మానించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ 35 ఏళ్ల పాటు సంఘంలో ఎంతో హుందాగా వెంకటేశ్వరరావు పనిచేశారన్నారు. కార్యక్రమంలో సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ గ్రామసభ

జయంతిపురం(జగ్గయ్యపేట): గ్రామ సచివాలయంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామసభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్పీలు 2022-23కు సంబంధించి గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పనుల వివరాలను గ్రామ సభలో వివరించారు. ఏడాదిలో జరిగిన పనులలో ఇబ్బందులుంటే సభ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసింహారావు, డీఆర్పీలు వెంకటేశ్వరరావు, సంతోష్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



పెనుగంచిప్రోలు: విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయులు ఇప్పుడు వస్తున్న సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఎంఈఓ డి.రవీంద్ర అన్నారు. స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో పెనుగంచిప్రోలు, వత్సవాయి, జగ్గయ్యపేట మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు గురువారం సైన్స్ కాంప్లెక్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన విద్యావిధానం, తరగతి కేంద్ర మూల్యాంకనంపై రిసోర్స్ పర్సన్ ముక్కా సత్యనారాయణ, సైన్స్ ప్రాజెక్టులను ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసి ఐదు ప్రాజెక్టులను అప్లోడ్ చేయాలని మరో రిసోర్స్ పర్సన్ జె.సదానంద్ వివరించారు. రాబోయే రోజుల్లో పరీక్షలు, ప్రశ్నలు ఎలా ఉండాలో, ఉంటాయో యూట్యూబ్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ కె.జలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు కొత్త పింఛన్ల పంపిణీ

వత్సవాయి: నూతనంగా మంజూరైన పింఛన్లను శుక్రవారం పంపిణీ చేస్తామని ఎంపీడీవో సీహెచ్ చెన్నారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 178 కొత్త పింఛన్లు మంజూరైనట్లు చెప్పారు. ప్రాధాన్యతాక్రమంలో వచ్చాయన్నారు. అర్హత కలిగిన మిగిలినవారికి కూడా మంజూరు అవుతాయన్నారు. వలంటీర్ల ద్వారా కొత్తవారికి పింఛన్లు అందుతాయని చెప్పారు.

సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

నందిగామ: కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు గ్యాస్ ధరలను తగ్గించి ప్రజలను మరోసారి మోసం చేయాలని చూస్తోందని సీపీఎం నాయకుడు కటారపు గోపాల్ మండిపడ్డారు. సీపీఎం ఆధ్వర్యంలో నందిగామ పట్టణంలో గురువారం సాయంత్రం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ ఎనిమిది సంవత్సరాల క్రితం కేవలం రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం రూ.1200కు చేరుకుందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేవలం రూ.200 తగ్గించి రక్షాబంధన్ కానుక అని చెప్పటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో పలువురు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గిరిప్రదక్షిణ

మెట్టగుట్ట/పెనుగొలను(గంపలగూడెం): శ్రావణ పౌర్ణమి సందర్భంగా పెనుగొలను శివారు మెట్టగుట్టపై విరాజిల్లుతున్న శ్రీశేషాచల శ్రీనివాసుని గిరి ప్రదక్షిణ ఉత్సవం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో మొదటిసారిగా నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు కోలాహలంగా పాల్గొన్నారు. ఆలయ అర్చకులు తూమాటి యోగానంద చార్యులు, శ్యామసుందరాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు సంప్రదాయబద్ధంగా జరిపారు. విష్వక్సేన పూజతో ప్రత్యేక కార్యక్రమాలను ప్రారంభించారు. అంకురార్పణ, కంకణ ధారణ తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీశేషాచల శ్రీనివాసమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉంచి చత్ర, ఛామర, మంగళ వాయిద్యాలతో భక్తులు గిరిప్రదక్షిణను అట్టహాసంగా నిర్వహించారు. గోవిందనామం పలుకుతూ భక్తులు స్వయంగా రథాన్ని లాగుతూ కొండ చుట్టూ ప్రదక్షిణ చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, ఆలయ కమిటీ అధ్యక్షులు జొన్నల ప్రతాపరెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధే అజెండా

- మున్సిపల్ చైర్ పర్సన్ మండవ వరలక్ష్మి
- కౌన్సిల్ సమావేశంలో పలు అంశాలపై తీర్మానం



ప్రతిపక్ష కౌన్సిలర్లకు గణాంక వివరాలతో కూడిన సమాధానం చెబుతున్న మున్సిపల్ కమిషనర్ జయరాం

నందిగామ: పట్టణాభివృద్ధే అజెండాగా ముందుకు వెళుతున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ వరలక్ష్మి అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ అధ్యక్షతన కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం 3 గంటలకు ప్రారంభమైంది. ఈ సమావేశంలో మొత్తం 71 అంశాలపై చర్చించి తీర్మానం చేశారు. పలు అంశాలపై ప్రతిపక్ష కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నలకు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం గణాంక వివరాలతో కూడిన సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా జరుగుతున్న అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని కోరారు. పట్టణంలో అన్ని ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు తెలిపారు. ముఖ్యంగా రహదారుల అభివృద్ధితో పాటు డ్రైనేజీల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో వైస్ చైర్పర్సన్ ఓర్సు లక్ష్మి, అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహాలపై ప్రతిపక్ష కౌన్సిలర్ల హడావుడి

కౌన్సిల్ సమావేశంలో ప్రతిపక్ష కౌన్సిలర్లు విగ్రహాల గురించి కొద్దిసేపు హడావిడి చేశారు. గాంధీ సెంటర్‌లో గతంలో తొలగించిన విగ్రహాలను తీసుకువచ్చి మున్సిపల్ కార్యాలయంలో భద్రపరిచారు. అయితే అప్పట్లో ఆ విగ్రహాలను ఏర్పాటుచేసిన దాతలు, నాయకులు అధికారుల అనుమతితో వాటిని మున్సిపల్ కార్యాలయం నుంచి తీసుకువెళ్లి బుధవారం రాత్రి గాంధీ సెంటర్‌లో ఏర్పాటు చేసుకున్నారు. ఈ విషయంపై కార్యాలయ ఆవరణలో ఉన్న విగ్రహాలు అక్కడికి ఎలా వెళ్లాయంటూ వాదులాటకు దిగారు. మున్సిపల్ కమిషనర్ సమాధానం చెబుతున్నా కూడా వినిపించుకోకుండా కొద్దిసేపు హడావిడి చేశారు.



గాంధీసెంటర్‌లో తిరిగి తెచ్చి పెట్టిన విగ్రహాలు

తొలగించిన విగ్రహాలు తిరిగి గాంధీసెంటర్‌లో...

నందిగామ: పట్టణంలోని గాంధీ సెంటర్ అభివృద్ధిలో భాగంగా గతంలో నెలకొల్పిన విగ్రహాలను కొద్దిరోజుల క్రితం అధికారులు తొలగించిన సంగతి పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో ఆ విగ్రహాలను అప్పట్లో ఏర్పాటు చేసిన వారు అధికారుల అనుమతితో వాటిని తీసుకువెళ్లి బుధవారం రాత్రి నూతనంగా విగ్రహాల ఏర్పాటు కోసం సిద్ధం చేసిన ప్రాంతంలో ప్రతిష్ఠించుకున్నారు. ఈ అంశంపై మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాంను వివరణ కోరగా గతంలో తాము ఏర్పాటు చేసుకున్న విగ్రహాలను తమకు ఇవ్వాలని వారు కోరిన నేపథ్యంలో ఇచ్చినట్టు తెలిపారు. తిరిగి ఏర్పాటుచేసిన విషయం తమకు సమాచారం లేదన్నారు. పలు విగ్రహాలు మున్సిపల్ కార్యాలయంలో అధికారుల పర్యవేక్షణలో ఉన్నాయన్నారు.

వినూత్న పద్ధతిలో రాఖీ వేడుకలు



పేటలో చెట్టుకు రాఖీ కడుతున్న విజ్ఞాన్ స్కూల్ విద్యార్థులు



రాఖీ అనే అక్షరాకృతిలో కూర్చున్న విజ్ఞాన్ స్కూల్ విద్యార్థులు



పేటలోని బాలుర హైస్కూల్‌లో బాలురకు రాఖీలు కడుతున్న బాలికలు



మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్రకు రాఖీ కడుతున్న వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు

జగ్గయ్యపేటఅర్బన్: నేను నీకు రక్ష-నీవు నాకు రక్ష అనే భావాన్ని తెలిపే రాఖీ పౌర్ణమి వేడుకలను వినూత్న పద్ధతిలో గురువారం స్థానిక విజ్ఞాన్ స్కూల్‌లో నిర్వహించారు. సోదర సోదరీమణుల మధ్య ఉండే ప్రేమానురాగాలను తెలిపే రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక విజ్ఞాన్ స్కూల్‌లో స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణాల ఆధునీకరణలో భాగంగా వృక్షాలు కనుమరుగవుతూ , పర్యావరణ సమతుల్యం దెబ్బతింటున్న ఈ రోజుల్లో వృక్షాలను పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలియజేస్తూ వృక్షో రక్షతి రక్షితః అంటూ వృక్షాలను మనం రక్షిస్తే వృక్షాలు మనకు కావాల్సిన ప్రాణ వాయువును అందిస్తూ మనలను రక్షిస్తాయని తెలుపుతూ వృక్షానికి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ప్రతి విద్యార్థి ఒక్కొక్క మొక్కను నాటి నీరు పోసి పోషించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బాలబాలికలు రాఖీ అనే అక్షరాకృతి వచ్చేలా ఏర్పడి తమ ఉత్సాహాన్ని తెలిపారు. స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి ఈ పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరిత, సుమలత, లక్ష్మీ, దుర్గ, కల్యాణి, అరుణ, గీత, హసీన, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్ నివాసంలో రాఖీ వేడుకలు

జగ్గయ్యపేటఅర్బన్: మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర నివాసంలో గురువారం రక్షా బంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా, కౌన్సిలర్లు కాశీ అనురాధ, పూసల సీతారావమ్మ, దువ్వల రమాదేవి, కాటగాని శివకుమారి, కోఆప్షన్ సభ్యురాలు షేక్ బషీరున్నీసా తదితరులు వచ్చి చైర్మన్ రాఘవేంద్రకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉద్యోగోన్నతిపై టీపీఓ బదిలీ



నందిగామ: పట్టణ టౌన్ ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న ఝాన్సీ ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం కార్యాలయంలో ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఉద్యోగోన్నతిపై విశాఖపట్నం కు వెళుతున్న ఆమె మరింత మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరామ్, ఏఈ ఫణి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మిక్‌లో బీటెక్ తరగతులు ప్రారంభం

కంచికచర్ల(వీరులపాడు): ఇంజినీరింగ్‌లో ప్రతి విభాగానికి ఒక ప్రత్యేకత ఉందని విద్యార్థులు, తల్లిదండ్రులు వాటిని గుర్తించి భవిష్యత్తుకు కావాల్సిన నైపుణ్యాలను ముందునుంచే నేర్చుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ వంశీకిరణ్ అన్నారు. కంచికచర్ల మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో బీటెక్ మొదటి ఏడాది తరగతులు గురువారం ప్రారంభించిన సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులకు ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలోని విద్యార్థులకు ఉత్తమ విద్యతో పాటు క్రీడలు, నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల సీఈవో పాండురంగారావు, మేనేజ్‌మెంట్ సభ్యుడు సుహాస్, ఆయా విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా 'పాశం'



కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీలను కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు పాశం వెంకటేశ్వర్లు అన్నారు. విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా ఆయన గురువారం రాత్రి ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో సమాజ్ వాది పార్టీ రాష్ట్ర నాయకుడు జగదీష్ యాదవ్, బీసీ సంక్షేమసంఘం యువజన అధ్యక్షుడు కుమ్మరి క్రాంతికుమార్, డీబీఎఫ్ నేత సుబ్బారావు, న్యాయవాది భాస్కరరావు, మైనారిటీ మహిళా నాయకురాలు షేక్ ఫరాదా పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు మరింత శోభ


కలెక్టర్ ఢిల్లీరావు



కలెక్టరేట్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ సంపత్‌కుమార్, డీఆర్వో మోహన్‌కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి కలెక్టరేట్‌కు మరింత శోభను తీసుకువస్తామని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు చెప్పారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా ఆహ్లాదకర వాతావరణం కల్పించి మోడల్ కలెక్టరేట్‌గా తీర్చి దిద్దడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్ ప్రాంగణాన్ని గురువారం జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ ఢిల్లీరావు పరిశీలించారు. కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణను ఇప్పటికే కొంత మేర పచ్చదనంతో తీర్చిదిద్దటం అభినందనీయమన్నారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా రెవిన్యూ అధికారి కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో పాలన సాగించడంతో అనేక మంది ప్రజలు కార్యాలయానికి వస్తుంటారన్నారు. దీని దృష్ట్యా కలెక్టరేట్ ప్రాంగణంలో నేరేడు, మామిడి, ఉసిరి వంటి ఫలసాయపు వృక్షాలతో పాటు టేకు, గానుగ, రావి, బాదం వంటి నీడనిచ్చే చెట్లను పెంచాల్సిన అవసరం ఉందని వివరించారు. మొక్కలు నాటడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యాలయ ప్రాంగణంలో దివ్యాంగులకు, మహిళలకు ప్రత్యేకంగా మరుగుదొడ్ల నిర్మించాలన్నారు. ఎలక్షన్ గోడౌన్‌కు అవసరమైన మరమ్మతులను పూర్తిచేసి ఉపయోగానికి సిద్ధంగా ఉంచాలన్నారు. పింగళి వెంకయ్య సమావేశ మందిరం వద్ద సందర్శకుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మినరల్ కూలింగ్ వాటర్‌ప్లాంట్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. వ్యర్థ నీరు ఇంకుడు గుంతను ఏర్పాటుచేస్తే భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. మొక్కలు, వృక్షాల పేర్లను ప్రదర్శించేలా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలోనే మోడల్ కలెక్టరేట్ గా తీర్చిదిద్దడానికి సమష్టిగా కృషి చేద్దామని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. ఆ ప్రాంగణాన్ని కలెక్టరేట్ పరిపాలన అధికారి ఇంతియాజ్ బాషా, కో ఆర్డినేషన్ విభాగం సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, భూసేకరణ విభాగం సూపరింటెండెంట్ ఎం. దుర్గాప్రసాద్, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది. పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు సాయం



విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న చైర్మన్ ప్రసాదరెడ్డి, పక్కన ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి

మైలవరం: ఇంజినీరింగ్‌లో ప్రతి విభాగంలో మొదటి స్థానంలో ఉత్తీర్ణులైన 50 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.10 వేలు చెక్కును అందజేశారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులు గురువారం ప్రారంభించారు. ముందుగా కళాశాల వ్యవస్థాపక చైర్మన్ దివంగత లకి రెడ్డి బాలిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చైర్మన్ లకిరెడ్డి ప్రసాదరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి తరగతులు ప్రారంభించారు. చైర్మన్ ప్రసాదరెడ్డి తల్లి సరస్వతి పేరున ఈ చెక్కులను అందజేశారు. కళాశాల కో ఫౌండర్, హానరరీ చైర్మన్ లకిరెడ్డి జయప్రకాష్‌రెడ్డి ఆన్‌లైన్‌లో మాట్లాడారు. కళాశాల ప్రెసిడెంట్ జి. శ్రీనివాసరెడ్డి, ఆయా విభాగాధిపతులు పాల్గొన్నారు.

కనులవిందుగా వేణుమాధవుని కల్యాణం



నెమలిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నెమలి(గంపలగూడెం): మండలంలోని నెమలి శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం స్వామి మాస కల్యాణం కనులవిందుగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు తిరునగరి గోపాలాచార్యులు, అర్చక బృందంచే రుక్మిణీదేవి, సత్యభామ సమేత శ్రీవేణుమాధవుని కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. 9మంది దంపతులు పీటలపై కూర్చొని కన్యాదానం చేశారు. వివాహ ఘట్టాలను, విశిష్టతను అర్చకులు భక్తులకు వివరించారు. భక్తులు విశేషంగా స్వామి కల్యాణాన్ని తిలకించారు.

తిరువూరు: స్థానిక శ్రీ వేంకటాచలస్వామి దేవస్థానంలో శ్రావణ పూర్ణిమ సందర్భంగా గురువారం మాసకల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు దేవయాజనం వేణుగోపాలాచార్యులు, సత్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణం వీక్షించారు. అనంతరం గరుడసేవ నిర్వహించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

వీరులపాడు: ఎదుగుదల లోపించి మొక్కజొన్న పంట ఎండిపోతుండగా పత్తిలో తామర పురుగు, నల్లి తెల్లదోమ, పచ్చదోమ ఉధృతి అధికంగా ఉందని గరికపాడు కేవీకే శాస్త్రవేత్తలు మధువాణి, కృష్ణంరాజు తెలిపారు. మండలంలోని బోడవాడ, తాటిగుమ్మి, జుజ్జూరు, చెన్నారావుపాలెం గ్రామాల్లో మొక్కజొన్న, పత్తి పంటలను జిల్లా వ్యవసాయాధికారి నాగమణిమ్మతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్లరేగడి భూముల్లో సాగు చేసిన మొక్కజొన్నకు 13-0-45 ఒక శాతం వారం రోజుల వ్యవధిలో సుమారు మూడు నుంచి నాలుగు సార్లు పిచికారీ చేయడం ద్వారా బెట్ట పరిస్థితుల నుంచి పంటను కాపాడుకోవచ్చని తెలిపారు. పత్తిలో పసుపు, బ్లూ రంగు జిగురు అట్టలను ఎకరాకు 10 చొప్పున పంట ఎత్తులో ఏర్పాటు చేయటం ద్వారా రసం పీల్చు పురుగును నివారించుకోవచ్చని తెలిపారు. ముఖ్యంగా రైతులు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సలహాల మేరకు ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో జోగేంద్ర ప్రసాద్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వడ్డెరలకు ప్రాధాన్యం ఇచ్చిన సీఎం జగన్



వడ్డెర్ల విమోచన దినోత్సవ జెండా ఆవిష్కరిస్తున్న మైనింగ్ డైరెక్టర్ రామారావు తదితరులు

ముక్కపేట(వత్సవాయి): గతంలో ఏ ప్రభుత్వంలో లేని విధంగా వడ్డెర్లలకు ప్రాధాన్యతను కల్పించింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు అన్నారు. వడ్డెర విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా నాలుగు మున్సిపల్ చైర్మన్లు, రాష్ట్రంలోనే అతిపెద్ద మిర్చిమార్కెట్ యార్డు అయిన గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ పదవి, ఎమ్మెల్సీ పదవులను ఇచ్చి గౌరవించారన్నారు. నియోజకవర్గంలో కూడా ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను వడ్డెర్లకు అనేక పదవులను ఇచ్చారన్నారు. ఇటువంటి ప్రభుత్వానికి వడ్డెర్లు అందరూ అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడేటి శారమ్మ, వైఎస్సార్ సీపీ గ్రామాధ్యక్షుడు కనగాల రమేష్, జిల్లా అధ్యక్షులు దేరంగుల శ్రీనివాసరావు, నియోజకవర్గ నాయకులు ఉప్పుతోళ్ల వెంకటేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ తమ్మిశెట్టి సోమయ్య, బత్తుల జానకిరామయ్య, తమ్మిశెట్టి శ్రీను, కనగాల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వడ్డెర విమోచన దినోత్సవం



వడ్డెర విమోచన దినోత్సవంలో నాయకులు

అల్లూరు(వీరులపాడు): మండలంలోని అల్లూరు గ్రామంలో వడ్డెర సంఘ నాయకులు బత్తుల మంగయ్య, గంజి కృష్ణ ఆధ్వర్యంలో గురువారం వడ్డెర విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు వడ్డెర జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వడ్డెరలు కొన్ని రాష్ట్రాలలో ఎస్సీ, ఎస్టీల జాబితాలో ఉండగా మన రాష్ట్రంలో బీసీ-ఏగా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి మన రాష్ట్రంలో కూడా వడ్డెరలను ఎస్టీల్లో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బత్తుల నరసింహారావు, వేముల నరసింహారావు, ఉప్పుతోళ్ల నాగార్జున, గంజి గోపి, సాంబయ్య, తమ్మిశెట్టి డేవిడ్, బండారు రాంబాబు, నాగేశ్వరరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లే అవుట్‌లపై చర్యలకు వినతి



అక్రమంగా లే అవుట్‌లు వేస్తున్న వ్యవసాయ భూమి(ఫైల్)

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని పురపాలక సంఘ పరిధిలో అక్రమంగా ఏర్పాటుచేస్తున్న లే అవుట్‌లపై చర్యలు తీసుకోవాలని 5 వ వార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన తహసీల్దార్ సూర్యారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని ఆర్‌ఎస్ నం: 102, 103, 104, 105, 106 సర్వే నంబర్లలో సుమారు 5 ఎకరాల వ్యవసాయ భూమిని గ్రావెల్ తోలి అనుమతులు లేకుండా, ల్యాండ్ కన్వర్షన్ ఫీజులు చెల్లించకుండా ప్లాట్లు వేస్తున్నారని తెలిపారు. సంబంధిత విషయంపై సర్వే నంబర్లు పట్టాదారులు ఎవరో గమనించి వారి నుంచి ప్రభుత్వానికి రావాల్సిన 10 శాతం భూమిని అనగా సుమారు రూ.2.50 కోట్ల విలువ గల ప్రభుత్వానికి రావాల్సిన భూమిని ప్రభుత్వానికి అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

జేవీవీ కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవం



జన విజ్ఞాన వేదిక గంపలగూడెం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు



తిరువూరు మండల జేవీవీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు

తోటమూల(గంపలగూడెం): ప్రజల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంచటానికి కృషి చేస్తున్న జన విజ్ఞాన వేదిక వంటి సైన్స్ ప్రచార సంస్థలు బలపడాల్సిన అవసరం ఉందని జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ గంగాధర్ అన్నారు. తోటమూలలో గురువారం జరిగిన జేవీవీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూఢ నమ్మకాలు పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో వాటి నియంత్రణకు ప్రభుత్వం చట్టం రూపొందించాలన్నారు. జేవీవీ మండల అధ్యక్షుడిగా కె.శేషగిరి, ప్రధాన కార్యదర్శిగా బి.సైదులు, కోశాధికారిగా పి.కృష్ణయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జేవీవీ చెకుముకి రాష్ట్ర కన్వీనర్ ఎం.హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు: జనవిజ్ఞాన వేదిక తిరువూరు మండల కమిటీకి కొత్త కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఎం.సుధాకర్, డీ సుదర్శన్, గౌరవాధ్యక్షులుగా ఆర్. నాగేంద్ర బాబు, కే నరసింహారావు, బీజే సుందరరావు, పీ శీనయ్య, కోశాధికారిగా సుబానీ, సమతా కన్వీనర్‌గా ఎస్.ఉషారాణి, 10 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

నందిగామ: పట్టణంలోని రామలింగేశ్వర నగర్ లో గల షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం, శ్రావణ పౌర్ణమి నేపథ్యంలో విశేష పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు వేకువ జామునే స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పలు రకాల విశేష పూజలు, పలు సంధ్యలలో విశేష హారతులిచ్చారు. సాయంత్రం సమయంలో పల్లకి సేవా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆయా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.